# అంధకారంలో హైవే

- కొండమల్లేపల్లి ప్రధాన రహదారిపై వెలుగని హైమాస్ట్ లైట్లు
- చీకట్లో ప్రమాదాల బారిన ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



కొండమల్లేపల్లి : హైదరాబాద్ రోడ్డులో వెలుగని వీధి దీపాలు



కొండమల్లేపల్లి: నాగార్జునసాగర్ రోడ్డులో వెలుగని హైమాస్ట్ లైట్లు

కొండమల్లేపల్లి, మే 15: కొండమల్లేపల్లి పట్టణంలో హైదరాబాద్-నాగార్జున సాగర్ ప్రధాన రహదారిపై వీధి దీపాలు వెలుగకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం లక్షల రూపాయాలు వెచ్చించి ఏర్పాటు వీధి దీపాలు ఏర్పాటు చేసింది. అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో ఎప్పుడు వరుసగా రెండు రోజులు వెలిగిన పాపన పోలేదు. దాంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ రోడ్డులో ఎమ్మెల్యే నిధులు రూ. 57 లక్షలతో అక్టోబర్ 4న హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఇవి గ్రామపంచాయతీ నిర్వహణలో జరుగుతుండగా ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో ఒక్క రోజు లైట్లు వెలిగితే మళ్లీ పది, పదిహేను రోజుల వరకు వెలుగడం లేదని స్థానికులు ఆరోపి స్తున్నారు.

ఇక నాగార్జునసాగర్ రోడ్డులో జాతీయ రహదారి 167 కావడంతో రోడ్డు నిర్వహణ తీసుకున్న సదరు కాంట్రాక్టర్ హైమాస్ట్ లైట్ల మరమ్మతులు పూర్తిగా మరిచారు. ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, నాగార్జున సాగర్ ప్రధాన రహదారుల గుండా నిత్యం వేలాది వాహనాలు 24 గంటలు వెళ్తుంటాయి దాంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నివారణకు ఆర్ అండ్ బీ, గ్రామపంచాయతీ, పోలీస్ శాఖ వారు దృష్టి సాధించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### అధికారులు దృష్టి సారించాలి

కొండమల్లేపల్లిలో వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల తీవ్రతను తగ్గించడానికి అధికారులు వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు నెలకు రెండు మూడు సార్లు చెడిపోయి వెలుగడం లేదు. దాంతో సీసీ కెమెరాల రికార్డింగ్‌కు అంతరాయం కలుగుతున్నట్లు సమాచారం. ఆర్అండ్‌బీ, గ్రామ పంచాయతీ అధికారులు, పోలీస్ శాఖ వారు దృష్టి సారించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

### త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

హైదరాబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఓల్టేజీ సమస్యతో లైట్లు వెలగడం లేదు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో సమస్య ఏర్పడుతుంది. సాగర్ రోడ్డు జాతీయ రహదారి కాంట్రాక్టర్ మరమ్మతు చేయడం పట్టించుకోకపోవడంతో పలు సార్లు గ్రామపంచాయతీ అధీనంలో మరమ్మతులు చేయించాం. వీధి దీపాలు వెలిగేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్యను పరిష్కరిస్తాం.

-వీరబాబు, పంచాయతీ కార్యదర్శి, కొండమల్లేపల్లి



# ఉత్తమ విద్యార్థులకు 18న పురస్కారాలు



డీఈఓ భిక్షపతిని సన్మానిస్తున్న గాంధీ సంస్థల వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి

రామగిరి, మే 15: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ ఆధ్వర్యంలో ఈనెల 18న ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం డీఈఓ భిక్షపతిని కలిసి పురస్కారాల అందజేతకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా యానాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ శనివారం నల్లగొండలోని డైట్ సమావేశ మందిరంలో నల్లగొండ మండలంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి ప్రతిభ చూపిన 79 మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆ 27మంది ప్రధానోపాధ్యాయులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గాంధీ సంస్థల ప్రతినిధులు ముక్కాముల నర్సింహ, ఎండీ అజీజ్, హరిదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్ఎం శ్రీదేవి

నల్లగొండ సిటీ, మే 15 : గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా ఆర్టీసీ నల్లగొండ డిపోలో రెండో విడుత ఉద్యోగులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల కేంద్రాన్ని ఆర్ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్ఎం శివశంకర్, మాధవి సందర్శించారు. అనంతరంఉద్యోగులతో మాట్లాడి పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఉద్యోగి ఆర్యోగాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం రాంమ్మోహన్‌రెడ్డి, సీఐ హుస్సేన్ గిరి ఉన్నారు.

# రోడ్డు పక్కనే వాహనాల నిలిపివేత

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



కట్టంగూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన నిలిపిన వాహనం

కట్టంగూర్, మే 15 : నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారి పక్కన భారీ వాహనాలను నిలిపి వేస్తున్నారు. దాంతో ఇతర వాహనాలకు రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని అయిటిపాముల నుంచి పామనుగుండ్ల వరకు దాబాలు, చిన్నపాటి హోటళ్లు ఉండడంతో వాహనదారులు రహదారిపై గంటల తరబడి నిలుపడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తి ప్రమాదాలు జరుగుతున్నాయి. దాంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కన వాహనాలు నిలిపివేయడం వల్ల ఇటీవల ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృత్యువాత పడగా మరికొంత మంది గాయాలయ్యాయి. ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అరుదైన వ్యాధులకు శ్రీబాలాజీ దవాఖానలో మెరుగైన వైద్యసేవలు

- దవాఖాన యాజమాన్యం సునీత,గోపినాథ్





మంగమ్మతో దవాఖాన యాజమాన్యం పోశం సునీత, చిలుకూరి గోపినాథ్ న్యూరో ఫిజియన్ డాక్టర్ అభిషేక్

మిర్యాలగూడ టౌన్, మే 15 : అరుదైన వ్యాధులకు మిర్యాలగూడ పట్టణంలో మెరుగైన వెద్య సేవలందిస్తున్న పట్టణానికి చెందిన శ్రీ బాలాజీ న్యూరోకేర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి యాజమా న్యం పోశం సునీత, చిలుకూరి గోపినాథ్ తెలిపారు. దవాఖానలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి మంగమ్మకు జ్వరం, వాంతులతో స్పృహ కోల్పోవడంతో ఆమెను కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకొచ్చినట్లు చెప్పారు. న్యూరో ఫిజిషియన్ డాక్టర్ అభిషేక్ ఆధ్వర్యంలో ఆమెకు ఎంఆర్ఐ, సీఎస్ఎఫ్ పరీక్షలు చేయడంతో మెదడులో వాపు, గడ్డలున్నాయని(పయోజెనిక్ మెనిన్‌జైటిస్ వ్యాధిగా) గుర్తించారు. అనంతరం మంగమ్మకు చికిత్స చేయడంతో పూర్తిగా కోలుకోన్నట్లు తెలిపారు. సమావేశంలో మంగమ్మ కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లగొండలో బీఆర్ఎస్‌దే విజయం

- ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి

గుర్రంపోడ్, మే 15 : నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమని, ప్రజలంతా ఉద్యమ పార్టీ వైపే ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గుర్రంపోడ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఏ ఒక్కటీ అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ పై ప్రజలు కోపంతో ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు అలానే ఉందన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు కుప్ప పృథ్వీరాజ్, కునూర్ సైదిరెడ్డి, వేముల యాదయ్య, మల్లోజు నాగార్జునాచారి, మేకల నాగిరెడ్డి, ముద్దు నిశాంత్ ఉన్నారు

## ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి

- ఉప ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జా





సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు రాహుల్‌బొజ్జా పక్కన కలెక్టర్ చందనాదీప్తి

నీలగిరి, మే 15 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికలో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని జిల్లా సాధారణ పరిశీలకుడు రాహుల్ బొజ్జ అన్నారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సులభంగా తీసుకోవద్దని, ఎన్నికల సంఘం జారీ చేసిన సూచనలు, నిబంధనలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర విషయాలకు సంబంధించి తనని సంప్రదించాలనుకునే వారు 986 377107 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. అభ్యర్థులు వారి ప్రచారంలో కులం, మతం, ఎదుటి వ్యక్తులను దూషించడం, ప్రార్థనా స్థలాల్లో ప్రచారం వంటివి చేయకూడదని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని, ముందస్తు అనుమతి లేకుండా ఇతరుల ఇండ్ల గోడలపై రాతలు రాయడం, హోర్డింగులు ఏర్పాటు చేయడం వంటివి చేయొద్దని, ర్యాలీలు ఇతర వాటికి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ప్రజలకు సాధారణ జీవన పరిస్థితులకు ఆటంకం కలిగించవద్దని, ఎవరిని భయపెట్టకూడదని, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఇచ్చే రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, వరంగల్- ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ అభ్యర్థులు పార్లమెంట్ ఎన్నికల ప్రచార సైలెన్స్ పీరియడ్ పూర్తయినందున పూర్తిస్థాయిలో ప్రచారాన్ని నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఆయా జిల్లాలో ప్రచారం నిర్వహించుకుంటే సంబంధిత ఏఆర్వోల ద్వారా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు చేయాల్సి వస్తే 1950, 1800425144 నంబర్ల ద్వారా తెలుపాచ్చని, సీ-విజిల్ ద్వారా మద్యం, నగదు వంటివి ఎక్కడైనా పంపిణీ చేస్తున్నట్లయితే ఫిర్యాదు చేయోచ్చన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుకు పరిమితి లేనప్పటికీ తప్పనిసరిగా అభ్యర్థులు లెక్కలను నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఉంటుందని ఆమె వెల్లడించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, నల్లగొండ ఆర్డీఓ రవి పాల్గొన్నారు.

# యువకుడి అనుమానాస్పద మృతి

- హత్య అని కుటుంబ సభ్యుల ఆరోపణ



కిరణ్( ఫైల్)

చందంపేట(నేరేడుగొమ్ము),మే 15 : నేరేడుగొమ్ము మండలంలోని పోలేపల్లి - తిమ్మాపురం రహదారిపై మంగళవారం అర్థరాత్రి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. నేరేడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన ఎద్దు దశరథ, లచ్చమ్మ దంపతుల కుమారుడు కిరణ్(28) ఇంటి వద్ద ఉంటూ స్వయం ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తల్లి లచ్చమ్మతో కలిసి దేవరకొండలోని పోచంపల్లి బ్యాంకులో డబ్బులు డ్రా చేసి అనంతరం తల్లి స్వగ్రామానికి బయల్దేరింది. కిరణ్ స్నేహితులతో దేవరకొండలో కొద్దిసేపు గడిపి అదే రోజు రాత్రి పోలేపల్లికి చేరుకున్నాడు. అక్కడి నుంచి స్వగ్రామానికి కాలినడకన వెళ్తుండగా పోలేపల్లి- ఇసుకబావి మార్గమధ్యంలో కిరణ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు కుటుంబ సభ్యులు, సమాచారం ఇవ్వడంతో వారి ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా తమ కుమారుడిని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కొట్టి చంపారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు దేవరకొండ రూరల్ సీఐ సురేశ్, ఎస్ఐ సతీశ్ తెలిపారు. కాగా చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు.

## 19న మిర్యాలగూడలో అజీమిస్ షాన్ జల్సా



జల్సా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముస్లిం పెద్దలు

మిర్యాలగూడ, మే 15 : ఈనెల 19న మిర్యాలగూడలోని ఉస్మానియా మజీద్‌లో మౌలానా అతికుల్ రెహమాన్ ఆధ్వర్యంలో అజీమిస్ షాన్ జల్సా నిర్వహిస్తున్నట్లు మిర్యాలగూడ ముస్లిం పెద్దలు హఫీజొద్దిన్‌పాషా, అహ్మద్ చావుష్ తెలిపారు. బుధవారం స్థానిక ఉస్మానియా మజీద్‌లో జల్సా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ఈ జల్సాకు గుజరాత్‌కు చెందిన మత పెద్దలు మౌలానా సలావుద్దిన్ సైఫీ హాజరవుతున్నట్లు తెలిపారు. ఆదివారం సా యంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జిల్లాలోని ముస్లింలందరూ పెద్ద ఎత్తు హాజరై జల్సాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉస్మానియా కమిటీ అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్, అంజాద్‌బాబా, తౌఫిక్, కమిటీ సభ్యులు మహమ్మద్ రఫీక్, హఫీజ్ అబ్దుల్ మన్నాన్, మార్కజ్‌పాషా, షఫీ, రైస్, జుబేర్, సాధిక్, సుల్తాన్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకిరేకల్, మే 15 : నేడు నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీ, కాటమయ్య బజార్, రెహమత్‌నగర్, చీమలగడ్డ, పటేల్ నగర్, సంతోష్ నగర్, మూసీ రోడ్డు, డాక్టర్స్ కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, శివాజీనగర్, విద్యానగర్, తాటికల్ రోడ్డు, మున్సిపల్ ఆఫీసు, రఘురామ థియేటర్ ఎదురుగా, సూర్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సాయిగణేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణకేంద్రంలోని 11కేవీ పోలీస్ స్టేషన్ ఫీడర్ లైన్ ఏ బీ స్విచ్‌ల రిపేరుకు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పిడుగుపాటుతో గాయపడిన యువకులకు తాసీల్దార్ పరామర్శ



సిద్దార్థను వివరాలు అడిగి తెలుసుకుంటున్న తాసీల్దార్ ప్రమీల

త్రిపురారం, మే 15: మండలంలోని నీలాయిగూడెం గ్రామంలో మంగళవారం పిడుగుపాటుతో ఒకరు మృతిచెందగా ఇద్దరు యువకులు గాయాలయ్యాయి. వారిని తాసీల్దార్ గాజుల ప్రమీల బుధవారం పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్రికెట్ ఆడుతుండగా పిడుగుపడి మర్రి రుషి మృతి చెందడాని, చాగంటి సిద్దార్థ, దైవం ప్రదీప్‌కు గాయలుకావడంతో భయపడి పరుగులు తీసినట్లు చెప్పారు.ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తానని, ఆరోగ్యం పట్ల యువకులు జాగ్రత్తలు పాటించాలని, వేసవి సెలవుల్లో కూడా విద్యాశిక్షణ, శారీరక శిక్షణ వైపు యువకులు ఉండాలని, మనోధైర్యంతో ఉండాలని ఆమె తెలిపారు.

## చెరువు శిఖం ఆక్రమించి మట్టి తరలిస్తున్న వారిపై కేసు



చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

వేములపల్లి, మే 15 : చెరువు శిఖం ఆక్రమించికొని, నకిలీ హద్దులను ఏర్పాటు చేసి మట్టిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామానికి చెందిన కేతనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట మహేశ్ గ్రామ శివారులో నియామల్కం (పెద్ద చెరువు) చెరువు శిఖం హద్దులను అక్రమంగా తొలగించి మట్టిని తరలిస్తున్నారు. ఇరిగేషన్ ఏఈఈ సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్‌పై కేసు నమోదు చేసి జేసీబీ, ఏడు ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

### ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

వేములపల్లి, మే 15 : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన జెర్రిపోతుల సతీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దాంతో గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ సభ్యులు సతీశ్‌ను బుధవారం పరామర్శించి రూ.25వేలు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన రెమడాల భిక్షం కాలుకు గాయం కావడంతో అతడికి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో దశరథ, సురేందర్, ప్రవీణ్, వెంకట్, సతీశ్, శంకర్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలి

- జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి



నకిరేకల్ : చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి

నకిరేకల్, మే 15: అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం ఏర్పాటుచేయాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి సూచించారు. మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. పిల్లల పూర్వ ప్రాథమిక విద్య, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆరా తీశారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్లను తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలోనే భోజనం చేసే విధంగా చూడాలన్నారు. ఆమె వెంట సీడీపీఓ ఆశ్రా అంజుమ్, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సూర్యకళ, ఆయాలు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**RECRUITMENT**
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |

# అధ్వానంగా ఇర్కిగూడెం రహదారి



గుంతల మయంగా మారిన తాళ్లవీరప్పగూడెం -ఇర్కిగూడెం రహదారి

దామరచర్ల, మే 15: మండలంలోని తాళ్ల వీరప్పగూడెం నుంచి ఇర్కిగూడెం వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. రోడ్డుంతా గుంతల మయంగా మారి చుట్టూ కంపచెట్లు పెరగడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అసలే గుంతలు అందులో కంపచెట్లు పెరుగడంతోఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. తాళ్లవీరప్పగూడెం నుంచి ఇర్కిగూడెం వెళ్లే రహదారి సుమారు 4 కిలోమీటర్లు ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు గుండా రైతులతో పాటుగా రెండు గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. దామరచర్లకు చేరుకోవాలంటే ఇదే దగ్గర రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రానున్నది వానకాలం కావడంతో వర్షాలు పడి రోడ్డు గుంతల్లో నీరు నిల్వడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డు మరమ్మతు చేపట్టి, కంపచెట్లు తొలగించాలని కోరుతున్నారు.

## సాయి మణికంఠ ఆలయ వార్షికోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ముత్తి లింగయ్య, ఆలయ కమిటీ సభ్యులు

కట్టంగూర్, మే 15: మండల కేంద్రంలోని సాయిమణికంఠ ఆలయ 14వ వార్షికోత్సవ కరప్రతాలను ఎంపీపీ జెల్లి ముత్తిలింగయ్య ఆలయ కమిటీ సభ్యులతో బుధవారం కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల క్రితం కట్టంగూర్ ఆలయాన్ని నిర్మించామని జూన్ 2న వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోగుల నర్సింహ, కోశాధికారి గుడిపాటి శివప్రసాద్, అర్చకులు కొట్టారు సత్యనారాయణ శర్మ, గురుస్వామి పూలస్వామి, సభ్యులు కడవేరు మల్లికార్జున్, రాపోలు వెంకటేశ్వర్లు, మన్నెం అంజయ్య పాల్గొన్నారు.